# ఆత్మదృష్టి గలవాడే ముక్తుడు

ప్రేమస్వరూపులారా!

కనుల కగుపడు దృశ్యమును గాంచి మీరు ఇదే సత్యమని భావిస్తున్నారు. కాని, సత్యమిది కాదు. 'ఉన్నదొక్కటె దైవంబు ఎన్నటికిని. లేనిదయ్యెను లోకంబు కానరయ్య'. కంటికి కనిపించే దృశ్యములన్నీ సత్యమని భావించి మీరు కాలమును వ్యర్థము చేస్తున్నారు. ఇవి యేవీ సత్యము కాదు. సత్యమనగా త్రికాలములయందు మార్పు చెందకుండా నిలిచియుండేది. అదియే దైవము. క్షణక్షణమునకు మార్పుచెందే దృశ్యమును సత్యమని భావించుకోవడం ఎంత వెఱ్ఱితనం! ఈనాడు స్టూడెంటు, రేపు ఆఫీసరు, ఎల్లుండి రిటైర్డు ఆఫీసరు, ఇందులో ఏది సత్యము? స్టూడెంటు సత్యమా? ఆఫీసరు సత్యమా? రిటైర్డు ఆఫీసరు సత్యమా? పెండ్లికాక మునుపు భర్త ఎవరు? భార్య ఎవరు? ఈ సంబంధము ఎంత కాలము? తాత్కాలికమే! ఈవిధంగా జగత్తులో మనకు కనిపించే ప్రతి విషయము, మనం చేసే ప్రతి కార్యము అనిత్యమైనవే! కాని, దైవం మాత్రం ఎప్పటికీ దైవమే! నిన్న దైవమే, రేపూ దైవమే, ఎల్లుండీ దైవమే! అట్టి సత్యనిత్యమైన దైవత్వాన్ని విశ్వసించక అనిత్యము, అశాశ్వతములైన దృశ్యాల్ని చూసి అవే సత్యమని మీరు భ్రమిస్తున్నారు. కనుక, మొట్టమొదట ఏది సత్యమో గుర్తించటానికి ప్రయత్నించండి. సత్యాన్ని గుర్తించినప్పుడే సర్వమును గుర్తించిన వారౌతారు. సత్యాన్ని గుర్తించక ఎన్ని గుర్తించినప్పటికినీ ప్రయోజనం లేదు. ఈ జగత్తంతయు మార్పుచెందునదే! ఈనాటి పర్వతము రేపు గుట్టగా మారవచ్చును. ఈనాటి చిన్న ప్రవాహము రేపు పెద్ద నదిగా మారవచ్చును. ఇట్టి అనిత్యమైన జగత్తును దృష్టిలో ఉంచుకొని, మీరు దీనినే విశ్వసించి, సత్యమైన దైవాన్ని విస్మరిస్తున్నారు. ఇదే మీ కష్టనష్టములకు, దుఃఖమునకు మూలకారణము. కష్టములు వస్తున్నాయంటున్నారు. కాని, అవి ఎక్కడినుంచి వస్తున్నాయి? మీ సంకల్పములు, మీ కర్మలయొక్క ఫలితములే మీరనుభవించే కష్టములు.

sri sathyasaivachanamrutam

## తేదీ 27.9.2006, దసరా ఉత్సవాలు, సాయికుల్వంత్ హాలు

ప్రపంచములో ప్రతి ఒక్కటీ మారేటటువంటిదే! మారనటువంటిది ఒక్క దైవమే! అట్టి దైవాన్ని హృదయమునందుంచుకొని మన ప్రేమను ఆ దైవానికే అర్పితం గావించి, ఆనందాన్ని అనుభవించాలి. అదే మానవునియొక్క ప్రధాన కర్తవ్యము. ఏమిటీ మానవ జీవితము? తినటము, త్రాగటము, నిద్రించటము, మరణించటం.. ఇదేనా! ఇంతమాత్రానికే మానవత్వం పవిత్రమైనదని చెప్పడానికి ఎట్లా వీలవుతుంది! మానవుడు పుట్టినప్పుడు చాలా పవిత్రునిగా ఉన్నాడు. కాని, క్రమంగా పెరుగుతున్నకొద్దీ తన పవిత్రతను కోల్పోతున్నాడు. అది సరికాదు. ఎప్పటికీ పవిత్రంగానే ఉండాలి. నన్ను చూడండి – నేను పుట్టినప్పుడు బాలుడను. నేనెప్పటికీ బాలుడనే! అయితే, శారీరకంగా ఎన్నో మార్పులు కలుగుతుంటాయి. ఈ మార్పులు కేవలం భౌతికమైనవి.

**దేహియే దేవదేవుడు**

మన దేహము, మనస్సు, ఇంద్రియాలు ఇవన్నీ భౌతికమైనవి. ఇక, అరిషడ్వర్గములన్నిటికీ కారణం మన భ్రమయే! వీటివల్లనే మనలో ఉన్న ఆత్మను మనము గమనించలేకపోతున్నాము. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. దుర్లభమైన మానవ జన్మ ఎత్తినందుకు మనలోని ఆత్మను గమనించాలేగాని, ఈ లౌకికమైన, భౌతికమైన విషయాలపై దృష్టి నిలుపకూడదు. ఆత్మను గమనించిన వాడే ముక్తుడు. భుక్తికోసం ప్రాకులాడేవానికి కేవలం పంచభూతములపైన, పంచకోశములపైన, పంచేంద్రియములపైననే ధ్యాస ఉంటుంది. అట్లుకాకుండా, 'దేహమనిత్యము, మనస్సు చంచలమైన కోతివంటిది', అని తెలుసుకున్నవానికి మాత్రమే ఆత్మదృష్టి ఉంటుంది. ఆత్మదృష్టిని నిరంతరం హృదయమునందు ఉంచుకొన్నవాడే ముక్తుడు. దేహము చూస్తామా అంటే ఇదొక నీటిబుడగవంటిది. ఇది అనిత్యమైనదని తెలిసికూడను మీరు దీనినే నమ్ముకొని జీవిస్తున్నారు. మీలో దేహాభిమానము ఉండినంతవరకు మీ జీవితమంతయు కేవలం కష్టనష్టములతో, సుఖదుఃఖములతో, పాపపుణ్యములతో బాధపడవలసినదే!

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**

sri sathyasai vachanamrutam

**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ యా**
**దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!**

'దేహి' మాత్రమే స్థిరమైనది. దానినే 'ఆత్మ' అని పిలిచారు. మీ దేహముయొక్క పేరు మీ తల్లిదండ్రులు పెట్టినది. పేరు లేకపోతే రూపమును గుర్తించుటకు వీలుకాదు. 'అనిల్ కుమార్' అనే పేరు ఇతని రూపమునకు గుర్తు. 'సత్యసాయి బాబా' అనే పేరు ఈ దేహాన్ని నిరూపిస్తుంది. మీరు అశాశ్వతమైనటువంటి దేహాన్ని ధరించి, ఈ బాహ్య ప్రపంచములో జీవిస్తూ ఉండడంచేత ఈవిధమైన భౌతిక లక్షణాలను గమనించవలసివస్తుంది. కాని, ఇవన్నీ కేవలం దృశ్య కల్పితములే! ఏది మనము చూడలేమో అదియే సత్యము. అదియే ఆత్మ. కాబట్టి, 'నీవెవరు?' అని అడిగినప్పుడు, 'నేను ఆత్మను' అని మీరు చెప్పాలి. దేహమునకు పెట్టిన పేరు మనకు ప్రధానము కాదు. ఈ రూపనామములు అనిత్యమైనవి. మనము ఈ ప్రపంచములో ఉండినంతవరకు మాత్రమే వీటికి ఉపయోగమున్నది. ప్రపంచమును వదలిపెట్టిన తరువాత ఎవ్వరూ వీటికి విలువ ఇవ్వరు.

**'పునరపి జననం పునరపి మరణం....'**

ఒక కోటీశ్వరునికి అంత్యకాలము ఆసన్నమైంది. అతను చాలా బాధ పడుతున్నాడు. తన చుట్టూ గుమికూడిన బంధువులను చూసి, 'నేను సంపాదించిన ధనమును మీకే అప్పజెప్పాను. నేను కట్టిన మేడలు, మిద్దెలు, నా బ్యాంకు డిపాజిట్టు సమస్తము మీకే అప్పజెప్పాను. అయినప్పటికీ ప్రస్తుతం నా గతి ఏమిటో మీరు యోచించకుండా మీ స్వార్థం మాత్రమే మీరు చూసుకుంటున్నారు', అని అతను వాపోయాడు. ఆ సమయంలో అతనికి జ్ఞానోదయమైంది. 'పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనం...' అని ఆదిశంకరులవారు చెప్పింది అతనికి జ్ఞాపకం వచ్చింది. "దేహము ఉన్నంతవరకే ఇవన్నీ. పోయేటప్పుడు ఇవేవీ వెంటరావు కదా", అని తెలివి తెచ్చుకున్నాడు. మానవుడు లోకములో ఉండినంత వరకు ఆస్తిపాస్తులకోసం ప్రాకులాడుతుంటాడు. కాని, ప్రాణము ఎక్కడకు వెళుతుందో అనేది ఏమాత్రం యోచించటం లేదు. దేహం ఉన్నంతవరకు 'ఇది నాకు సంబంధించినది', అని భ్రమిస్తున్నాము. ఇప్పుడిక్కడ నీవు కూర్చున్నావు. లేచి

sri sathyasai vachanamrutam

రెండడుగులు వేసేటప్పటికి నీ పరిస్థితి ఏమిటో నీకే తెలియదు. దేహము పోయిన తరువాత ఎవరికి ఎవరు! ఏ స్నేహితులతో నీకు సంబంధముంటుంది! ఏ బంధువులతో నీకు సంబంధ ముంటుంది! ఎవరికీ ఎవరితోనూ సంబంధముండదు. కనుక, దేహమునే ప్రధానంగా లక్ష్యమునందుంచుకోకూడదు. సత్కర్మలద్వారా దేహాన్ని మనం పరిశుద్ధం చేసుకోవాలి.

**మానవుడు చేయవలసిన సాధన ఏమిటి?**

ఈ ప్రపంచములో మనము అనేకరకములైన సంబంధాలను పెట్టుకోవటం చేత మనలో అనేకరకములైన మాలిన్యములు చేరిపోతున్నాయి. ఆ మాలిన్యాన్ని శుభ్రం చేసుకున్నప్పుడే మనకు ఆరోగ్యం చేకూరుతుంది. మొన్న వర్షాలు వచ్చినాయి. వర్షాలవల్ల నీరంతా కలుషితమైపోయింది. ఆ కలుషితమైన నీరు త్రాగడంచేత చాలామందికి జ్వరాలు వచ్చాయి. ఈనాడు ఎక్కడ చూచినా కష్టములు, నష్టములు, విచారములే! దీనికి కారణం మనం తినే తిండిలో, త్రాగే నీటిలో, పీల్చే గాలిలో 'పొల్యూషన్' (కాలుష్యం) చేరింది. ఈ కాలుష్యాన్ని తొలగించుకొని, హృదయాన్ని పవిత్రము చేసుకోవాలి. అందునిమిత్తం మన ప్రాచీనులు నవవిధ సాధనలను బోధించారు.

**శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనమ్**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్.**

ఈ సాధనలలో ఏదో ఒకదానిని అనుసరించి మన హృదయాన్ని పరిశుద్ధము చేసుకోవాలి. మానవత్వము దైవత్వముతో కూడినదేగాని కేవలం జీవత్వము కాదు. ప్రతి మానవుడు, ప్రతి ప్రాణికూడను దైవస్వరూపమే. క్రిమికీటకాదులు కూడా దైవస్వరూపములే! మానవుడు చేయవలసిన సాధన ఏమిటి? మానసిక సంబంధమైన విచారణ చేయాలి. ఏది సత్యము? దేహము సత్యమా? మనస్సు సత్యమా? ఇంద్రియాలు సత్యమా? ఏదీ కాదు. మనస్సు ఒక mad monkey (పిచ్చికోతి). ఇలాంటి చంచలమైన మనస్సును అనుసరిస్తే మనం గమ్యం చేరలేము. ఏనాటికైనా మనం ఈ దేహాన్ని వదలక తప్పదు. కనుక, ఇప్పటి నుండియే దీనిని మరచిపోవడానికి తగిన ప్రయత్నం చేయాలి. ఐతే, దేహం ఉన్నంతవరకు మనకు ఆహార విహారములు అవసరము. అవికూడను సాత్త్వికమైనవిగా, పవిత్ర మైనవిగా,

sri sathyasai vahini amrutam

పరిశుద్ధమైనవిగా ఉండాలి. ఇంతకంటె వేరు సాధన యేమి కావాలి!

**దైవచింతన చేస్తే అన్ని చింతలూ దూరమైపోతాయి**

మనం ఏమి చేస్తున్నా 'సోఽహం' తత్త్వముపై మనస్సును కేంద్రీకరించాలి. మనం గాలిని పీల్చుకునే సమయంలో 'సో' అనే శబ్దము వస్తున్నది. తిరిగి 'హం' అనే శబ్దముతో గాలిని వదలిపెడుతున్నాము. 'సో' అనగా దైవం, 'హం' అనగా నేను. కాబట్టి, 'సోఽహం' అనగా 'నేనే దైవం' అని అర్థం. ఈరీతిగా, 'నీవే నేను, నేనే నీవు' అని ఏకత్వమునుగురించి చక్కగా విచారణ చేయాలి. దీనినే వేదము 'అహం బ్రహ్మాస్మి' అని బోధిస్తున్నది. "నేనే బ్రహ్మను. నేను మానవుడను కాదు, నేనే దైవమును. నిర్మోహత్వమే నా తత్త్వము", అని తెల్లవారి లేచినది మొదలుకొని రాత్రి పరుండు నంతవరకు ప్రతి క్షణం మీకు మీరు గుర్తు చేసుకోవాలి. 'నన్ను కని పెంచి పోషించినది దైవమే' అని విశ్వసించాలి. మీకు తల్లినిచ్చినది ఎవరు? దైవము కాదా! ప్రతి ఒక్కటీ దైవముయొక్క కృపయే! దైవచింతన మరచి అన్యచింతలు పెట్టుకుంటే అన్నివిధాలుగా మీరు నష్టపోవలసివస్తుంది. దైవచింతన మనసులో ఉంచుకొంటే అన్ని చింతలూ దూరమైపోతాయి. కనుక, "ప్రేమ ముదిత మనసె కహో రామ రామ రామ్." ప్రేమతో దైవభావాన్ని పెంచుకోవాలి. ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. ప్రేమయే లేకుండిన తల్లి లేదు, తండ్రి లేదు, సోదరుడు లేదు, భార్య లేదు. అంతా ప్రేమతో కూడినదే! కేవలం మన స్వార్థం కోసం, మన అనుకూలముకోసం, మన ఆనందంకోసం ప్రాపంచికమైన సంబంధ బాంధవ్యములను మనం కల్పించుకుంటున్నాము. స్వార్థమును త్యజించి ఆత్మసాక్షాత్కారముకోసం మనం ప్రయత్నించాలి. 'నేను' అనగా ఎవరు? దేహమా? మనసా? బుద్ధా? చిత్తమా? అహంకారమా? ఇవేవీ కాదు. 'నేను నేనే.' ఈ సత్యాన్ని మనం గుర్తించాలి.

**కోరికలను త్యజించడమే నిజమైన త్యాగము**

విద్యార్థులారా! మీరందరూ చదువుకుంటున్నారు, డిగ్రీలు తీసుకుంటున్నారు. అయితే, ఇటువంటి డిగ్రీలు తీసుకున్నవారు లోకంలో ఎంతమంది లేరు! వారి వలన లోకమున కేమి ఉపకారం జరుగుతున్నది! వారంతా కేవలం తమ కుటుంబముయొక్క పోషణే

srisathyasaivechanamrutam

చూసుకుంటున్నారుగాని, ఇతరులకు ఏమాత్రం సహాయం చేయటం లేదు. ఈ చదువులన్నీ కేవలం పొట్టకూటి నిమిత్తమే! అది కాదు ముఖ్యం. మనము స్వార్థరహితంగా సేవ చేయాలి. కోరికలను త్యాగము చేయాలి. ఆవిధముగా త్యాగము చేసినవాడే నిజమైన యోగి. యోగమంటే చెట్టు క్రింద కూర్చొని, కన్నులు మూసుకొని జపం చేయటం కాదు. మీ కోరికలను త్యాగం చేయటమే నిజమైన త్యాగము. సంకుచితమైన భావములను విసర్జించాలి; 'బ్రాడ్ హార్ట్'ను కలిగి వుండాలి. ఇక్కడ 'హార్ట్' అంటే 'ఫిజికల్ హార్ట్' (గుండె) కాదు. గుండె పెద్దదయితే ఆపరేషన్ చేయించుకోవలసివస్తుంది. మన హృదయాన్ని విశాలం గావించుకోవాలి. ప్రేమను అభివృద్ధిపరచుకోవాలి. అప్పుడే మనం నిజమైన మానవులమవుతాము.

### స్వామి మాటల్లో సకల వేదసారము ఇమిడి వున్నది

విద్యార్థులారా! స్వామి చెప్పే మాటలు చాలా తేలికగా ఉంటాయి. అయితే, సకల వేద శాస్త్రముల సారము నా మాటల్లోనే ఉంటున్నది. మీరు గొప్ప చదువులు చదివినామని గర్వించకండి. ఎంత చదువు చదివినప్పటికినీ వినయ విధేయతలతో ఉండాలి. నిజమైన జ్ఞానం గలవాడు వినయసంపన్నుడై ఉంటాడు. మానసిక తత్త్వములో కోరికలు లేకుండా ఉన్నప్పుడే మీరు సరియైన మానవులుగా ఉంటారు. మితిమీరిన కోరికలు ప్రమాదానికి దారితీస్తాయి. అనవసరమైన వాంఛలను పెంచుకోవడంవల్ల మీరు కాలమును, తద్వారా మీ జీవితమునే వ్యర్థం చేసుకున్నవారవుతారు. కాలము భగవత్స్వరూపము. కాబట్టి, కాలమును వ్యర్థం చేయకూడదు. ఊరికే న్యూస్ పేపర్సంతా చదువుతూ కూర్చుంటే మీ తలలో అంతా 'న్యూసెన్సే' చేరిపోతుంది. పేపర్లలో మనకు అవసరం లేని విషయాలన్నీ వేస్తున్నారు. ఆ బొమ్మలను మీరు చూశారా? ఆ విషయాలను మీరు చూశారా? ఛీ, ఛీ... అవి కాదు మనకు కావలసినది. ఏ కాస్త సమయం చిక్కినా ఆ సమయంలో మీరు 'సోఽహం' తత్త్వమును స్మరించాలి. రూపనామములకు అతీతమైన భగవత్ తత్త్వాన్ని దర్శించాలి. అప్పుడే మీకు సరియైన మానవత్వము ఏర్పడుతుంది. ఈ పండుగలన్నీ ఎందుకు వస్తున్నాయి? మనకు దైవాన్ని జ్ఞాపకము చేసే నిమిత్తమై వస్తున్నాయి. అన్ని మతములవారికి పండుగలున్నవి.

sri sathyasai vachanamrutam

ప్రతి మతమును మనం గౌరవించాలి.

**"మతములన్ని చేరి మంచినే బోధించె**
**తెలిసి మెలగ వలయు తెలివితోడ**
**మతులు మంచివైన మతమేది చెడ్డది?"**

మతము చెడ్డది కాదు. మతి చెడ్డదైనప్పుడే మతము చెడ్డదవుతుంది. మతిని మంచిగా పెట్టుకున్నప్పుడు మతములన్నింటిలోను ఏకత్వం గోచరిస్తుంది.

విద్యార్థులారా! మానవుడు ఆనందమయుడు. కాబట్టి, మీరు నిరంతరము ఆనందంగా ఉండాలి. భగవంతునితో తాదాత్మ్యం చెందినప్పుడే మీకు నిజమైన ఆనందము లభిస్తుంది. మితిమీరిన కోరికలు పెట్టుకొని నిరాశతో క్రుంగి పోకూడదు. ఏ పరీక్షలు వచ్చినా, ఏ కష్టములు వచ్చినా 'కేస్టరాయిల్ ఫేస్' (ఏడుపు మొహం) పెట్టకూడదు. ఎప్పుడూ నవ్వుతూ ఉండాలి. మీరు ఎంత ఉత్సాహంగా ఉంటారో మీలో ఆనందము అంతగా అభివృద్ధి అవుతుంది. అసలు మీరు చింత చేయవలసిన అవసరమేమున్నది! ఏమీ లేదు. పరీక్షలు వచ్చాయంటే చదవనివారికే చింత! బాగా చదివితే పరీక్షల భయమెందుకు! చదివితే తప్పక మంచి మార్కులు వస్తాయి. మీరు బాగా చదివి ఉత్తీర్ణులై దేశాన్ని ఉద్ధరించండి.

పండుగలన్నీ మనలో ఉత్సాహాన్ని పెంపొందిస్తాయి. ఈ దసరా ఉత్సవాలు మన దశేంద్రియములను అరికట్టడానికై ఉద్దేశించినవి. దసరాల్లో చాముండి మహిషాసురుణ్ణి వధించింది. దీని అంతరార్థమేమిటి? మనము అసురులను మనదగ్గరకు చేర్చుకోకూడదు. నరుడు నరునితోనే సంబంధము పెట్టుకోవాలిగాని, అసురునితో సంబంధమెందుకు!

**సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః**

సత్సంగంలో ప్రవేశించండి. చెడ్డవారితో చేరితే మీరూ చెడ్డవారవుతారు. కనుక, మీకు చెడ్డవారు కనిపిస్తే తక్షణం అక్కడినుండి వెళ్ళిపొండి. చెడ్డవారితో మనం స్నేహం చేయకూడదు. వారిపట్ల ద్వేషముకూడా మనకు వద్దు. ఎవరిని చూసినా దైవస్వరూపులుగా భావించి నమస్కరించండి. మిమ్మల్ని ద్వేషించేవారు ఎదురైతే తల తిప్పుకోవద్దు.

srisatyasaivachanamrutam

వారికికూడా మీరు నమస్కారం చేయండి. 'ఎలా వున్నావు సోదరా?' అని ప్రేమతో పలుకరించండి. 'నీవెలా ఉన్నావు సోదరా?' అని వారుకూడా మిమ్మల్ని ప్రేమతో పలుకరిస్తారు. మానవుడనగా సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలనే మానవతా విలువలు కలిగినవాడు. ప్రేమ ఉంటే శాంతి వస్తుంది, ధర్మము ఏర్పడుతుంది, సత్యము నిలుస్తుంది. ఎప్పుడూ సత్యమునే పలకండి; ధర్మమును పోషించుకోండి; శాంతి ననుభవించండి; ఆనందంగా జీవించండి. సమాజంలో ప్రేమతత్త్వంతో మెలగండి. ప్రేమయే దైవం, దైవమే ప్రేమ. ప్రేమలో జీవించండి. అప్పుడే మీకు సరియైన జ్ఞానం కలుగుతుంది. నేనెప్పుడూ మిమ్మల్ని 'ప్రేమస్వరూపులారా!' అని సంబోధిస్తాను. ఎందుచేతనంటే నాలో ఉన్నది కేవలం ప్రేమయే! అదే నా ప్రోపర్టీ. ఆ ప్రోపర్టీకి మీరందరూ వారసులు కండి! మీ అందరికీ నా ప్రేమను పంచుతాను.

**(తేదీ 27.9.2006, దసరా ఉత్సవాలు, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vachanamrutam